గొంతు కోసి విసిరేశారు..

మానవత్వం జీవం పోసింది

నెల రోజులు శ్రమించి శిశువు ప్రాణాలు నిలిపిన వైద్యులు

భోపాల్: ఓ ఆడ శిశువు జన్మించిన వెంటనే ఆ పాప బామ్మ నిర్దయగా గొంతు కోసి, చెత్త డబ్బాలో పడేసింది. కానీ మానవత్వం ఉన్న మనుషుల కారణంగా ఆ చిన్నారి మృత్యుంజయురాలిగా నిలిచింది. మధ్యప్రదేశ్ రాజ్‌గఢ్‌లో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రాజ్‌గఢ్ పట్టణంలో ఓ మహిళ ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే ఆమె బామ్మ ఆ శిశువు గొంతు కోసి, చెత్త డబ్బాలో పడేసింది. రక్తమోడుతున్న ఆ పసికందును ఆ దారిన పోయేవారు చూసి చలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ పసికందును మొదట జిల్లా ప్రభుత్వ దవాఖనకు, ఆ తర్వాత భోపాల్‌లోని కమలా నెహ్రూ దవాఖానకు తరలించారు. దవాఖాన హెచ్‌ఓడీ మాట్లాడుతూ, ఆ పసికందుకు పిహు అని పేరు పెట్టినట్లు తెలిపారు. ఆమెకు గాయమైనప్పటికీ, ముఖ్యమైన నరాలకు దెబ్బ తగలలేదని చెప్పారు. నెల రోజులకుపైగా శ్రమించి ఆ చిన్నారికి వైద్యం చేశామని.. ప్రస్తుతం ఆ శిశువు ప్రాణాపాయం నుంచి తప్పించుకుందని తెలిపారు. ఆమెను బాలల సంక్షేమ కమిటీ అనుమతితో రాజ్‌గఢ్‌లోని ఓ షెల్టర్ హోమ్‌కు అప్పగించామన్నారు. పసికందుపై హత్యాయత్నం చేసి, ఆమెను వదిలిపెట్టినందుకు ఆమె తల్లి, బామ్మలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

జయలలిత ఖజానాలో 4 వేల కోట్లు

తమిళనాడుకు అప్పగించిన కర్ణాటక

- **జాబితాలో 27 కిలోల పసిడి, వందల కిలోల వెండి, భూముల పత్రాలు**

బెంగళూరు, ఫిబ్రవరి 15: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ఏఐఏడీఎంకే నేత జయలలితకు చెందిన అక్రమ ఆస్తులను కర్ణాటక ప్రభుత్వం తమిళనాడుకు అప్పగించింది. ఇన్నాళ్లు బెంగళూరులోని కోర్టు కస్టడీలో ఉన్న ఆమె ఆస్తులు, వాటి పత్రాలను శుక్రవారం అధికారులు అధికారికంగా అప్పగించారు. జయలలితకు చెందిన 10 వేల చీరలు, 27 కేజీల బంగారం, వజ్రాభరణాలు, 750జతల పాదరక్షలు, 601 కిలోల వెండి వస్తువులు, 1672 ఎకరాల వ్యవసాయ భూముల పత్రాలు, నివాసాలకు సంబంధించిన దస్తావేజులు, 8,376 పుస్తకాలు, ఇతర వస్తువులు, సామగ్రిని న్యాయమూర్తి హెచ్‌ఎన్ మోహన్ సమక్షంలో వాటిని జైలు అధికారులు తమిళనాడు అధికారులకు అప్పగించారు. అక్రమార్జనకు సంబంధించి 2004లో తమిళనాడులో జయలలితపై కేసు నమోదు కాగా, దానిని కర్ణాటకకు బదిలీ చేశారు. తమిళనాడులో జప్తు చేసిన ఆస్తులు, పత్రాలను కర్ణాటకకు తీసుకువచ్చి భద్రపరిచారు. ఆ సమయంలో ఆ ఆస్తుల విలువ 913.3 కోట్లు ఉంటుందని అంచనా వేయగా, ఇప్పుడది 4 వేల కోట్లు ఉండవచ్చునని భావిస్తున్నారు.

ఏఐతో జ్ఞాన హీనులవుతున్నామా?

- దానిపై ఎక్కువ నమ్మకముంటే మెదడుకు తక్కువ పనే
- స్వీయ సామర్థ్యాన్ని నమ్మితే క్రిటికల్ థింకింగ్ చేస్తాం
- కృత్రిమ మేధపై అధ్యయనంలో ఆసక్తికర అంశాలు

సిడ్నీ: కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం మానవుడి ఆలోచనా శక్తిపై ఎలా పడుతున్నదనే అంశంపై తాజా అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వారానికి దాదాపు 30 కోట్ల మంది చాట్‌జీపీటీని వాడుతున్నట్లు అంచనా. చాలా వరకు మనం మెదడుతోనే ఆలోచించగలం. అయితే, చిన్న చిన్న లెక్కలు చేయడానికి, దుకాణాల్లో సరుకులు కొనడానికి పరికరాలపై ఆధారపడుతుండటం వల్ల మనం మన జీవితాలను సౌకర్యవంతంగా మార్చుకుంటున్నామా? లేక మనం వివేకహీనులుగా మారుతున్నామా? అనే ప్రశ్నకు అమెరికాలోని మైక్రోసాఫ్ట్, కార్నెగీ మెలన్ విశ్వవిద్యాలయం పరిశోధకులు 'అవును' అనే సమాధానం ఇవ్వవచ్చు అంటున్నారు! ఓపెన్‌ఏఐకి చెందిన చాట్ జీపీటీ వంటి జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన సమయంలో ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనదని పరిశోధకులు చెప్తున్నారు. చదివిన, విన్న, చెప్పిన, రాసిన విషయాన్ని గురించి ప్రశ్నించుకుని, విశ్లేషించుకుని, అర్థం చేసుకుని, మదింపు చేసుకుని, సరైన నిర్ణయం తీసుకోవడాన్ని క్రిటికల్ థింకింగ్(విశ్లేషణాత్మక ఆలోచన) అంటారు. యూజర్లు తమ క్రిటికల్ థింకింగ్‌పై జనరేటివ్ ఏఐ ప్రభావం గురించి ఎలా భావిస్తున్నారనే అంశాన్ని పరిశోధకులు తమ అధ్యయనంలో మదింపు చేశారు. ప్రస్తుత పద్ధతులు, నియమాలను బట్టి మనం సొంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటాం. వాదనలలో పొంతన కుదరడం, కచ్చితత్వం, గట్టి సంబంధం కలిగి ఉండటం వంటి విలువలు ఈ నియమాల్లో కొన్ని. మనకు ప్రస్తుతమున్న ప్రాపంచిక దృక్పథాలు, పక్షపాతాలు, అసంపూర్ణ లేదా కచ్చితత్వం లేని మానసిక విధానాలపై ఆధారపడటం వంటివి మన ఆలోచనల నాణ్యతపై ప్రభావం చూపే మరికొన్ని అంశాలని అధ్యయనంలో తేలింది. తాజా అధ్యయనంలో 319 మంది నాలెడ్జ్ వర్కర్స్ పాల్గొన్నారు. వీరు తాము జనరేటివ్ ఏఐ సహాయంతో నిర్వహించిన 936 టాస్క్‌ల గురించి చర్చించారు. వెరిఫికేషన్, ఎడిటింగ్ దశల్లో శ్రద్ధ పెట్టడంలో కన్నా, టాస్క్ నిర్వహణలో క్రిటికల్ థింకింగ్‌ను తక్కువగా ఉపయోగిస్తున్నట్లు యూజర్లు భావించారని తేలింది. ఏఐపై ఎక్కువ నమ్మకం గలవారు క్రిటికల్ థింకింగ్‌ను తక్కువగా ప్రదర్శించారని, తమపై తమకు ఎక్కువ నమ్మకం గల వారు క్రిటికల్ థింకింగ్‌ను ఎక్కువగా ప్రదర్శించారని వెల్లడైంది. అందువల్ల జనరేటివ్ ఏఐ వ్యక్తి యొక్క క్రిటికల్ థింకింగ్‌కు చేటు చేయదని తెలుస్తున్నది. యూజర్ల క్రిటికల్ థింకింగ్‌ను ప్రోత్సహించేందుకు ఫీచర్లను పెట్టాలని జనరేటివ్ ఏఐ డెవలపర్లకు ఈ అధ్యయనకర్తలు సలహా ఇస్తున్నారు. అయితే, ఏఐని ఉపయోగించడానికి ముందు, ఉపయోగించేటపుడు ప్రతి దశలోనూ విశ్లేషణాత్మక ఆలోచన అవసరమేనని పరిశోధకులు సూచిస్తున్నారు.

ఆదాయ పన్ను బిల్లుపై సెలెక్ట్ కమిటీ

చైర్మన్‌గా బీజేపీ ఎంపీ

న్యూఢిల్లీ: కొత్త ఆదాయ పన్ను బిల్లును పరిశీలించడానికి సెలెక్ట్ కమిటీ ఏర్పడింది. 31 మంది సభ్యులతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ కమిటీని నియమించారు. బీజేపీ ఎంపీ బైజయంత్ పాండాను ఈ కమిటీకి చైర్మన్‌గా ఎంపిక చేశారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు నిశికాంత్ దూబే, జగదీశ్ షెట్టర్, దీపేందర్ సింగ్ హూడా, నవీన్ జిందాల్, సుప్రియా సూలే తదితరులకు ఈ కమిటీలో చోటు దక్కింది. ఫిబ్రవరి 13న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త ఆదాయ పన్ను బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందిగా ఆమె స్పీకర్‌ను కోరారు. వచ్చే పార్లమెంటు సమావేశాలనాటికి సెలెక్ట్ కమిటీ తన నివేదికను ఇవ్వనున్నట్టు తెలుస్తున్నది.

మద్యం సేవిస్తున్న మహిళల్లో

అస్సాం ఫస్ట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: దేశంలో అన్ని రాష్ట్రాల కంటే అస్సాంలో మద్యం సేవించే మహిళల సంఖ్య ఎక్కువగా ఉందని తాజా సర్వే ఒకటి తేల్చింది. దేశంలో మద్యపాన వినియోగంపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఈశాన్య రాష్ట్రాల్లో మద్యపానం ఎక్కువగా ఉందని సర్వే తేల్చింది. దేశ వ్యాప్తంగా 15-49 ఏండ్ల వయస్సు గల మహిళల్లో మద్యపానం 1.2 శాతం ఉండగా, అస్సాంలో ఈ సగటు 16.5 శాతంగా నమోదైంది. అస్సాం తర్వాత రెండో స్థానంలో మేఘాలయ నిలిచింది. ఇక్కడ 8.7 శాతంగా ఉంది.

సీజేఐ ప్రమేయమెందుకు?

- **కార్యనిర్వాహక నియామకాల ప్రక్రియపై ఉప రాష్ట్రపతి ఆశ్చర్యం**
- **జగ్‌దీప్ ధన్‌కడ్ వ్యాఖ్యలపై ప్రముఖ న్యాయ నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు**

భోపాల్, ఫిబ్రవరి 15: కార్యనిర్వాహక నియామకాల ప్రక్రియలో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా(సీజేఐ) భాగస్వాములయ్యే విధానంపై ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. శుక్రవారం భోపాల్‌లోని నేషనల్ జ్యుడీషియల్ అకాడమీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'మన దేశంలో లేదా ఏదైనా ప్రజాస్వామ్యంలో సీబీఐ డైరెక్టర్ ఎంపిక వంటి కార్యనిర్వాహక నియామకాల ప్రక్రియలో చట్టప్రకారం సీజేఐ ఎలా పాలుపంచుకోగలరు? ఇందుకు హేతుబద్ధత ఏంటి? దీనిని పునఃసమీక్షించాల్సిన సమయం వచ్చింది. కచ్చితంగా ఇది ప్రజాస్వామ్యంలో ఇమడదు. కార్యనిర్వాహక నియామకాల ప్రక్రియలో సీజేఐను ఎలా భాగం చేస్తాం?' అని ధన్‌కడ్ వ్యాఖ్యానించారు.

న్యాయనిపుణుల్లో భిన్నాభిప్రాయాలు

ఉప రాష్ట్రపతి వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ధన్‌కడ్ అభిప్రాయంపై న్యాయనిపుణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీబీఐ డైరెక్టర్‌తో పాటు ఇతర కార్యనిర్వాహక నియామకాల ఎంపిక కమిటీలో సీజేఐ ఉండొద్దని సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది అభిప్రాయపడ్డారు. జ్యుడీషియల్ ట్రిబ్యునళ్ల ద్వారా జరిగే నియామకాల్లో మాత్రం సీజేఐ ప్రమేయం ఉండొచ్చని అన్నారు. అయితే, ఎంపిక ప్రక్రియలో సీజేఐ ఉండటం వల్ల నియామకాలు మెరుగ్గా జరుగుతాయని మరో సీనియర్ న్యాయవాది షోయబ్ ఆలం పేర్కొన్నారు. కార్యనిర్వాహక నియామకాల ప్రక్రియలో సీజేఐ ఉండాలని, తద్వారా ఈ ప్రక్రియ మరింత స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరుగుతుందని న్యాయవాది మోహిత్ మాథుర్ అభిప్రాయపడ్డారు. కాగా, చీఫ్ ఎలక్షన్ కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి సీజేఐను తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అంశం ఇప్పటికే సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

భారత దౌత్యానికి పరీక్ష

- **అమెరికా నుంచి అక్రమ వలసదారుల తరలింపుపై కేంద్ర మాజీ మంత్రి చిదంబరం**
- **అమృత్‌సర్‌ను "డిపోర్ట్ సెంటర్"గా మార్చవద్దని పంజాబ్ సీఎం డిమాండ్**

న్యూఢిల్లీ: అమెరికాకు అక్రమంగా వలస వెళ్లినవారితో రెండో విమానం భారత దేశానికి వస్తుండటం భారత దౌత్యానికి పరీక్ష అని కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరం శనివారం అన్నారు. ఈ విమానంపైనే అందరి దృష్టి ఉందని చెప్పారు. వారి చేతులకు బేడీలు, కాళ్లకు తాళ్లు కట్టి తీసుకొస్తున్నారా? అని ఎక్స్ పోస్ట్‌లో ప్రశ్నించారు. 119 మంది అక్రమ వలసదారులతో అమెరికన్ విమానం శనివారం అర్ధరాత్రి అమృత్‌సర్‌లో దిగే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ విమానంలో 67 మంది పంజాబీలు, 33 మంది హర్యానా, 8 మంది గుజరాత్, ముగ్గురు యూపీ రాష్ట్రాలకు చెందినవారు, కాగా గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్‌లకు చెందినవారు ఇద్దరేసి ఉండొచ్చని చెప్తున్నారు. వీరు అమెరికాలో ప్రవేశించిన వెంటనే వారి పాస్‌పోర్టులను చింపేసినట్లు అక్కడి అధికారులు తెలిపారు.

మరోవైపు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ శనివారం కూడా కేంద్రంపై విరుచుకుపడ్డారు. పవిత్ర నగరమైన అమృత్‌సర్‌ను "డిపోర్ట్ సెంటర్"గా మార్చవద్దని డిమాండ్ చేశారు. దేశంలో అనేక వైమానిక స్థావరాలు ఉన్నాయని, వాటిలో ఎక్కడైనా ఈ విమానాలను దించవచ్చునని చెప్పారు. ఆయన శనివారం అమృత్‌సర్ విమానాశ్రయానికి వెళ్లి, ఏర్పాట్లను పరిశీలించారు. అమెరికా నుంచి వస్తున్నవారి కోసం భోజనాల ఏర్పాట్లు చేశామని, వారిని వారి స్వస్థలాలకు చేర్చేందుకు వాహనాలను సిద్ధం చేశామని తెలిపారు. హర్యానాకు వెళ్లాల్సిన వారి కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇంకో వైపు పంజాబ్ యువతను విదేశాలకు తరలిస్తున్న మోసపూరిత ఏజెంట్లపై చర్యలు తీసుకోవడంలో పంజాబ్ సీఎం భగవంత్ మాన్ విఫలమయ్యారని కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు ఆరోపించారు.

ఈ సారి వాహనాలపై సుంకాల మోత

ట్రంప్ మరో నిర్ణయం

న్యూయార్క్: జనవరి 20న బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సుంకాల మోత మోగిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో పన్నుల భారానికి సిద్ధమయ్యారు. దేశంలోకి దిగుమతవుతున్న విదేశీ వాహనాలపై కూడా పన్నులు పెంచాలనుకుంటున్నట్టు శుక్రవారం ప్రకటించారు. ఏప్రిల్ 2 నుంచి వాహనాలపై కూడా సుంకాలు విధించనున్నట్టు ఆయన చెప్పారు. అయితే ఈ టారిఫ్‌ల గురించి ఆయన అదనపు సమాచారం ఇవ్వకపోయినా మార్చి 12 నుంచి అమలు చేస్తామని ప్రకటించిన స్టీల్, అల్యూమినియం ఉత్పత్తుల టారిఫ్‌ల మాదిరిగానే ఇది కూడా ఉండవచ్చునని భావిస్తున్నారు.

ఆకలి తీరుస్తున్న ప్రజాస్వామ్యం!

అమెరికా సెనేటర్‌కు జైశంకర్ కౌంటర్

మ్యూనిక్, ఫిబ్రవరి 15: భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పశ్చిమ దేశాల వైఖరిని ఎండగట్టారు. మ్యూనిక్ భద్రతా సదస్సులో శనివారం ఆయన ప్రజాస్వామ్యంపై మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న అభిప్రాయంతో తాను ఏకీభవించనని చెప్పారు. భారతదేశ ప్రజాస్వామ్య విజయాలను ఆయన వివరించారు. ప్రజాస్వామ్యం కూర్చుని తిండి పెట్టదంటూ అమెరికా సెనేటర్ స్లోట్కిన్ చేసిన వ్యాఖ్యలకు జైశంకర్ స్పందిస్తూ తమది ప్రజాస్వామిక సమాజం అయినందున 80 కోట్ల మంది జనాభాకు పౌష్టికాహారం లభిస్తోందని చెప్పారు. తమ దేశంలో ప్రజలు కడుపునిండా తిండి తినగలుగుతున్నారంటే అది ప్రజాస్వామ్య గొప్పదనమేనని ఆయన అన్నారు. తన చూపుడు వేలికి ఉన్న సిరా చుక్కను చూపిస్తూ ఇది ఇటీవల తన రాష్ట్రం(ఢిల్లీ)లో జరిగిన ఎన్నికలలో తాను ఓటు వేసిన గుర్తని ఆయన అన్నారు.

బిమ్స్‌లో ఫోన్ టార్చ్‌లైట్ల వెలుతురులో ఓ వ్యక్తికి కుట్లు వేస్తున్న వైద్యులు

ఫోన్ టార్చ్ వెలుతురులో చికిత్స

కర్ణాటకలో ప్రభుత్వ దవాఖానల దుస్థితి

బళ్లారి: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో సర్కారు దవాఖానల నిర్వహణ దారుణంగా తయారైంది. బళ్లారిలోని బళ్లారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(బిమ్స్) ఇటీవలి పరిస్థితులు దవాఖానల దుస్థితికి అద్దం పడుతున్నాయి. గురువారం ప్రమాదానికి గురై దవాఖానలో చేరిన ఓ వ్యక్తికి వైద్యులు ఫోన్ టార్చ్‌లైట్ల వెలుతురులో వైద్యం చేస్తున్న వీడియో వైరల్‌గా మారింది. అత్యవసర విభాగంలో కరెంటు పోవడంతో టార్చ్‌లైట్లు పెట్టుకొని వైద్యులు కుట్లు వేశారు. రెండేండ్ల క్రితమే ప్రారంభించిన ఈ దవాఖానలో ఇటీవలే ఆరు ప్రసూతి మరణాలు సంభవించాయి.

భారీగా క్రిప్టో కరెన్సీ పట్టివేత

అహ్మదాబాద్: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం రికార్డు స్థాయిలో రూ.1,646 కోట్ల విలువైన క్రిప్టో కరెన్సీని స్వాధీనం చేసుకుంది. మోసపూరిత పెట్టుబడుల పథకం గుట్టును రద్దు చేసింది. సెక్యూరిటీస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో వందలాది మంది డిపాజిటర్లు మోసపోయినట్లు గుర్తించింది. 'బిట్ కనెక్ట్ లెండింగ్ ప్రోగ్రామ్' నిర్వాహకులు ఈ మోసానికి పాల్పడినట్లు కేసు నమోదు చేశారు. 2016 నవంబర్- 2018 జనవరి మధ్య ఈ మోసం జరిగింది.

శీష్ మహల్‌పై సమగ్ర దర్యాప్తు: సీవీసీ ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తన అధికార నివాసం 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డు బంగళా విస్తరణ, మరమ్మతులు, అలంకరణల కోసం అధికంగా ఖర్చు పెట్టారని వచ్చిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని సీపీడబ్ల్యూడీని కేంద్ర విజిలెన్స్ కమిషన్ శనివారం ఆదేశించింది. అవినీతి జరిగినట్లు వచ్చిన ఆరోపణలతో ఆ బంగళాకు శీష్ మహల్ అని బీజేపీ పేరు పెట్టింది. 2015 నుంచి గత అక్టోబర్ వరకు ముఖ్యమంత్రిగా ఆ బంగళాలో అరవింద్ కేజ్రీవాల్ నివసించారు. బీజేపీ నాయకుడు విజేందర్ గుప్తా చేసిన ఫిర్యాదు, సీపీడబ్ల్యూడీ సమర్పించిన వాస్తవ నివేదికలను పరిగణనలోకి తీసుకున్న సీవీసీ ఇప్పుడు సమగ్ర దర్యాప్తు కోసం సీపీడబ్ల్యూడీని ఆదేశించింది.

'జైన్‌పై ప్రాసిక్యూషన్ రాజకీయ కుట్ర'

తమ పార్టీ నేత సత్యేంద్ర జైన్‌ను విచారించడానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం రాష్ట్రపతిని కోరడం రాజకీయ, పార్టీ నిర్వీర్యానికి కుట్ర అని ఆప్ నేత, ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు.

కుంభమేళా దారిలో రోడ్డు ప్రమాదం

10 మంది దుర్మరణం, 19 మందికి గాయాలు

హైదరాబాద్: ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు తండోపతండాలుగా తరలివెళ్తున్నారు. ఈ క్రమంలో కొన్ని ప్రమాదాలు జరిగి భక్తులు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. తాజాగా అలహాబాద్ జిల్లా మనుకాపురా ప్రాంతంలో మీర్జాపూర్-ప్రయాగ్‌రాజ్ జాతీయ రహదారిపై భక్తులతో నిండిన బొలెరో వాహనం ఓ బస్సును ఢీ కొనడంతో 10 మంది మృతి చెందగా, 19 మందికి గాయాలయ్యాయి. ప్రమాదంలో బొలెరో వాహనం నుజ్జునుజ్జయింది. మృతులు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ విచారం వ్యక్తంచేశారు.

కుంభమేళాలో మరోసారి అగ్ని ప్రమాదం

మహా కుంభమేళాలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం సెక్టార్ 18, 19ల మధ్య మంటలు చెలరేగాయి. అనేక టెంట్లు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

సుప్రీం కోర్టును ఆశ్రయించిన రణవీర్

అతడి కేసు వాదించిన మాజీ సీజేఐ కొడుకు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా తనపై నమోదైన అనేక ఎఫ్ఐఆర్‌లను సవాలు చేస్తూ ప్రముఖ యూట్యూబర్ రణవీర్ అలహాబాదియా శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. యూట్యూబ్‌లో కమెడియన్ సమయ్ రైనాకు చెందిన ఇండియాస్ గాట్ లేటెంట్ షోలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై అలహాబాదియాపై దేశవ్యాప్తంగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అలహాబాదియా తరఫున మాజీ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ తనయుడు, న్యాయవాది అభినవ్ చంద్రచూడ్ వాదనలు వినిపించారు. అభినవ్ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం రానున్న రెండు, మూడు రోజుల్లో దీన్ని లిస్టింగ్ చేస్తామని తెలిపింది.

భారత్‌కు 'వాటర్ వర్త్' కేబుల్ వ్యవస్థ

మెటా ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ప్రాజెక్ట్ వాటర్ వర్త్ పేరుతో ఏర్పాటు చేయనున్న ప్రపంచంలోనే అత్యంత పొడవైన సముద్ర గర్భ కేబుల్ వ్యవస్థతో భారత్‌ను అనుసంధానించనున్నట్టు మెటా సంస్థ శనివారం ప్రకటించింది. ఈ భారీ ప్రాజెక్టు ఈ దశాబ్దం ముగింపు నాటికి అందుబాటులోకి వస్తుందని తెలిపింది. భూమి చుట్టుకొలత కన్నా పెద్దగా 50,000 కిలోమీటర్లకు పైగా పొడవైన ప్రాజెక్టు వాటర్‌వర్త్ ఐదు ప్రధాన ఖండాలను కలుపుతుందని ప్రకటించింది. టెలికం ఆపరేటర్లు ఈ కేబుల్స్‌తో అనుసంధానమై వినియోగదారులకు ఇంటర్‌నెట్ సౌకర్యాన్ని సమకూరుస్తారు.

నా బిడ్డకు తండ్రి ఎలాన్ మస్క్

రచయిత్రి క్లెయిర్ ఆరోపణ

న్యూయార్క్, ఫిబ్రవరి 15: టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌పై అమెరికన్ రచయిత్రి ఆష్లే సెయింట్ క్లెయిర్ సంచలన ఆరోపణలు చేశారు. ఐదు నెలల క్రితం తాను జన్మనిచ్చిన బిడ్డకు ఎలాన్ మస్క్ తండ్రి అని 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. 'ఐదు నెలల క్రితం నేను ఓ బిడ్డకు జన్మనిచ్చాను. నా బిడ్డకు ఎలాన్ మస్క్ తండ్రి. మా బిడ్డ గోప్యత, భద్రత కోసం ఈ విషయాన్ని ఇంతకుముందు బయటపెట్టలేదు. నా బిడ్డ గోప్యతను మీడియా గౌరవించాలని కోరుతున్నా' అంటూ క్లెయిర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ ప్రకటనపై ఎలాన్ మస్క్ స్పందించలేదు. కాగా, ఎలాన్ మస్క్ గత 20 ఏండ్ల కాలంలో 12 మంది సంతానానికి జన్మనిచ్చారు.

విడాకులపై సాంస్కృతిక, వ్యక్తిగత విలువల ప్రభావం

ఇజ్రాయెల్ పరిశోధకుల అధ్యయనం వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాల్లో విడాకుల రేటు గణనీయంగా పెరుగుతున్నది. దీనికి గల కారణం ఏమైనా ఉందా? అన్నదానిపై హిబ్రూ యూనివర్సిటీ ఆఫ్ జెరూసలేంకు చెందిన పరిశోధకులు కొత్త విషయాలు బయటపెట్టారు. జీవిత భాగస్వాముల మధ్య ఉండే సాంస్కృతిక, వ్యక్తిగత విలువలు..ఇద్దరిపైనా పని చేస్తుందని, అదే విధంగా విడాకులను నిర్ణయిస్తుందని పరిశోధకులు కనుగొన్నారు. కమ్యూనికేషన్ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, ఇద్దరి మధ్య అనుబంధంలో మార్పులు..ఇవన్నీ విడాకులకు కారణం కావొచ్చని అధ్యయనం తేల్చింది.

గురుత్వాకర్షణతో పోరు తప్పదు!

- **భూమి మీదకు తిరిగి వచ్చాక వ్యోమగాములకు సవాల్ ఇదే**
- **పెన్సిల్ ఎత్తడమూ తమకు వ్యాయామమేనన్న సునీత**

న్యూయార్క్: సాంకేతిక కారణాలతో అంతర్జాతీయ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, విల్మోర్‌లను భూమిపైకి తిరిగి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్న వేళ కొత్త సవాళ్లు వెలుగులోకి వచ్చాయి. వారు భూమికి తిరిగొచ్చాక గురుత్వాకర్షణ శక్తి(గ్రావిటీ)తో పోరాడాల్సి ఉంటుందని తెలుస్తున్నది. భూ వాతావరణానికి అలవాటు పడేందుకు పలు కఠిన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని విల్మోర్, సునీతా విలియమ్స్ వెల్లడించారు. ఇటీవల సీఎన్ఎన్ వారిద్దరిని అంతరిక్షం నుంచి ఇంటర్వ్యూ చేసింది. నెలలకు పైగా మైక్రో గ్రావిటీ పరిస్థితుల్లో బరువు లేని స్థితిలో గడిపామని, భూమికి తిరిగొచ్చాక తమ శరీరం పలు శారీరక మార్పులకు గురవుతుందని వ్యోమగాములు తెలిపినట్టు సీఎన్ఎన్ పేర్కొంది. 'గురుత్వాకర్షణ శక్తి ఎంతో కఠినమైనది. మేము భూమిపైకి తిరిగొచ్చాక దాన్నే ఎదుర్కోవాల్సి ఉంటుంది. భూమి గురుత్వాకర్షణ శక్తి అన్నింటిని కిందికి లాగుతుంది. శరీరంలో ఉండే ద్రవాలు కిందికి లాగబడతాయి. ఆ పరిస్థితుల్లో పెన్సిల్ ఎత్తడం కూడా వ్యాయామంతో సమానం' అని విల్మోర్ తెలిపారు.

కఠిన సవాళ్లు తప్పవు

శరీరం గ్రావిటీ కారణంగా మార్పులు చెందుతున్నప్పుడు అసౌకర్యంగా, భారంగా ఉంటుంది. భూ వాతావరణానికి అనుగుణంగా ఉండటం సవాళ్లతో కూడుకున్నదని విలియమ్స్ వెల్లడించారు. 'ఆ పరిస్థితులకు అడ్జస్ట్ కావడం ఎంతో కష్టం. వేగంగా సంకోచించే కండరాల చర్యను తిరిగి పొందడం చాలా కఠినమైనది' అని విలియమ్స్ తెలిపారు.

సీఎం కోసం తెచ్చిన పూల కుండీలు చోరీ

బీహార్‌లో వింత ఘటన

బక్సర్: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పర్యటనను పురస్కరించుకుని అధికారులు ఏర్పాటు చేసిన వందలాది పూలకుండీలను ప్రజలు చోరీ చేశారు. ఈ వింత ఘటన బక్సర్‌లో శనివారం చోటు చేసుకుంది. తన ప్రగతి యాత్రలో భాగంగా నితీశ్ కుమార్ శనివారం బక్సర్ జిల్లా కేంద్రాన్ని సందర్శించి అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సీఎంకు స్వాగతం పలికేందుకు జిల్లా అతిథిగృహం వెలుపల రోడ్డుపైన వందలాది పూల కుండీలను అధికారులు ఏర్పాటు చేశారు. సీఎం అక్కడి నుంచి బయల్దేరిన మరుక్షణం పెద్ద సంఖ్యలో స్థానికులు పూల కుండీలను తీసుకుని ఉడాయించారు.

'ఏఐ' బాయ్ ఫ్రెండ్.. మస్తుంటడు!

చైనాలో డేటింగ్ సిమ్యులేషన్ గేమ్‌కు విపరీత ఆదరణ

బీజింగ్, ఫిబ్రవరి 15: 'నా మెస్సేజ్‌లకు స్పందించడు.. నేను చేసే ఫోన్ కాల్స్ ఎత్తడు, నా రోజు వారీ ముచ్చట్లు ఓపిగ్గా వినడు, నన్ను బుజ్జగించడు, నన్ను అస్తమానం పొగడడు..' సాధారణంగా ప్రతి ప్రేయసి తన ప్రియుడిపై చేసే ఫిర్యాదులివి. అయితే ఈ సమస్యలన్నింటినీ భర్తీ చేసే సాంకేతికత వస్తే ఎలా ఉంటుంది? ఆ కృత్రిమ క్యారెక్టర్ నిజమని భావిస్తూ దానితో చాటింగ్‌లో యువతులు మునిగేలా నిజం చేస్తే ఎలా ఉంటుంది? అయితే ఈ ఆలోచన భారత్‌లో నిజం కాకపోవచ్చేమో కానీ, చైనాలో పూర్తిగా విజయవంతమైంది. కృత్రిమ మేధతో సృష్టించిన కృత్రిమ బాయ్ ఫ్రెండ్స్ ఇప్పుడు చైనాలో ఎంతో ప్రాచుర్యం పొందారు. దీనిని సృష్టించిన వ్యాపారవేత్త ఇప్పుడు బిలియనీర్ అయిపోయారు. ఈ వ్యాపార విజయాన్ని పరిశీలిస్తే సమాజంలో ఇలాంటి అసాధారణ భాగస్వామ్యాలు భవిష్యత్తులో మరింత అవసరమన్న విషయాన్ని చెప్పకనే చెబుతున్నది. ఫోర్బ్స్ కథనం ప్రకారం.. షాంగై కేంద్రం గాయాహో రున్హా సృష్టించిన డేటింగ్ సిమ్యులేషన్ గేమ్ లవ్ అండ్ డీప్ స్పేస్ 60 లక్షల మందిని ఆకర్షించింది. సగటు యువతి తన ప్రియుడు ఎలా ఉండాలని కోరుకుంటుందో అలాంటి ఆదర్శ ప్రియుడిని ఇందులో సృష్టించారు. పొడవుగా, అందంగా ఉండే జేన్ అనే పాత్రను సృష్టించారు. జేన్ ఫోన్ టెక్స్టు సందేశాలకు త్వరగా స్పందిస్తాడు. వారి ఫోన్ కాల్‌కు వెంటనే సమాధానమిస్తాడు. వారు చెప్పే మాటలను ఓపికగా వింటాడు. అయితే అతనిలో ఉన్న ఏకైక లోపం అతనికి సిలికాన్ చిప్ లేకపోవడం. షాంగై కేంద్రంగా ఉండే పేపర్ గేమ్స్ అభివృద్ధి చేసిన ఈ గేమ్ ఏఐ, వాయిస్ రికగ్నిషన్ ఆధారంగా పని చేస్తుంది. ఈ గేమ్ ఐదు పురుష పాత్రలతో గేమ్‌లోని ఫోన్‌కాల్స్‌కు అనుగుణంగా స్పందిస్తూ వారితో సరస సల్లాపాలు సాగిస్తుంది. ఇది యువతులకు విపరీతంగా నచ్చేసింది. బాయ్ ఫ్రెండ్ స్థానాన్ని ఇది భర్తీ చేస్తుందని వారు భావిస్తుండటంతో దీనికి విపరీత ఆదరణ పెరిగింది.